

దిగుబడి ధమాల్

ఆరు గాలం కష్టించి సాగుచేసిన రైతులకు పంట చేతికి వచ్చేటప్పటికి అడుగడుగునా కష్టాలు ఎదురవుతున్నాయి. 8లో▸



వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదల పాలిట వరమని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. 8లో▸

క్లుప్తంగా

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

అనంతగిరి: ఇటీవలే జరిగిన మాస్టర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 18 పసిడి, 14 వెండి, 6 కాంస్య పథకాలను క్రీడాకారులు సాధించారు. సోమవారం విజేతలను ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అభినందించారు. మరిన్ని పథకాలు సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే ఆనంద్



కేటీఆర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: ఈ నెల 5న మంత్రి కేటీఆర్ వికారాబాద్ పర్యటన నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులు, నిధుల మంజూరు విషయాలను మంత్రి కేటీఆర్‌తో చర్చించినట్లు తెలిసింది.

ఫెన్సింగ్ పోటీల్లో పార్థసారథికి బంగారు పతకం



ట్రోఫీతో పార్థసారథి

కుల్కచర్ల: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో కుల్కచర్ల మండల యువకుడు పార్థసారథి బంగారు పతకాన్ని సాధించారు. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ – 17 ఫెన్సింగ్ పోటీల్లో టీం విభాగం, వ్యక్తిగత విభాగాల్లో బంగారు పతకాలను సాధించారు.

జాతిపిత ఆశయాలను నెరవేర్చాలి

అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



గాంధీ జయంతిలో అదనపు కలెక్టర్

వికారాబాద్ అర్బన్: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను, ఆదర్శాలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సత్యాగ్రహమే ఆయుధంగా.. అహింస, శాంతి మార్గంలో దేశానికి స్వాతంత్య్రం సాధించి పెట్టిన మహనీయుడు మహాత్మాగాంధీ అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయం ఏఓ అమరేందర్, మెప్మా పీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల మందు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పహాడీషరీఫ్: నల్లమందు విక్రయిస్తున్న వ్యక్తిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన ప్రజాపతి(58) కాటేదాన్‌కు వలస వచ్చాడు. కొన్ని రోజులుగా గుట్టుగా జల్‌పల్లి శ్రీరాం కాలనీలో నల్లమందును విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఆదివారం రాత్రి ప్రజాపతిని అరెస్టు చేశారు.

దిగుబడి ఢమాల్



మార్కెట్ యార్డుకు వచ్చిన పెసర ఉత్పత్తులు

నిరాశ మిగిల్చిన పెసర, మినుము

- భారీగా పడిపోయిన దిగుబడులు
- ఆందోళనలో రైతులు

తాండూరు: ఆరు గాలం కష్టించి సాగుచేసిన రైతులకు పంట చేతికి వచ్చేటప్పటికి అడుగడుగునా కష్టాలు ఎదురవుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో ఎన్ని కష్టాలున్నా వ్యవసాయం చేస్తే అతివృష్టి, అనావృష్టితో చివరకు అన్నదాతలకు అప్పులే మిగులుతున్నాయి. ఈ సీజన్‌లో సాగు చేసిన పెసర, మినుము వాతావరణం అనుకూలించక పంటలపై తీవ్ర ప్రభావం చూపించింది. ఈ వర్షాకాల సీజన్‌లో ఒక నెలలో వర్షం కురిస్తే మరుసటి నెలలో వర్షాలు పడలేదు. దీంతో స్వల్పకాలిక పంటలైన పెసర, మినుము, సోయ లాంటి పంటల దిగుబడి గణనీయంగా తగ్గిందని రైతులు వాపోతున్నారు.

వెలవెలబోతున్న మార్కెట్ యార్డు

ప్రతి ఏటా వేల క్వింటాళ్ల ఉత్పత్తులతో కళకళలాడే తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఈ సారి వెలవెలబోయింది. మార్కెట్ యార్డులో రెండుమూడేళ్లుగా పెసర, మినుము పంటల ఉత్పత్తుల కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. పెసర, మినుము ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పటికీ ఉత్పత్తులు మాత్రం తగ్గిపోయాయి. ఈ సీజన్‌లో మార్కెట్ యార్డులో పెసర క్వింటాలుకు గరిష్ట ధర రూ. 10,100, కనిష్ట ధర రూ.7,551, సగటు ధర రూ.8,905 చొప్పున ధరలు పలుకుతున్నాయి. ఇప్పటి వరకు 4,626 క్వింటాళ్ల పెసర పంట అమ్మకాలు జరిగాయి. మినుములు క్వింటాలుకు గరిష్ట ధర రూ.10,159, కనిష్ట ధర రూ.8,055, సగటు ధర రూ.9.479 చొప్పున ధరలు పలికాయి. దీంతో ఇప్పటివరకు 3,556 క్వింటాళ్లు కొనుగోళ్లు జరిగాయి. గతేడాది పెసర పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో క్వింటాలుకు రూ.6,300 ధర పలికింది. ప్రస్తుతం క్వింటాలుకు రూ.10 వేల వరకు ధరలు పలుకుతోండటం గమనార్హం.

పడిపోతున్న సాగు విస్తీర్ణం

వికారాబాద్ జిల్లాలో ప్రతి ఏటా పెసర, మినుము సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోతూవస్తోంది. గతంలో పంట దిగుబడుల సీజన్ వచ్చిందంటే చాలు ఆర్‌అండ్‌బీ రోడ్లు కల్లాలుగా దర్శనమిచ్చేవి. రెండుమూడేళ్లుగా అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు పంటలు నష్టపోతున్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



ప్రజలకు ఆరు పథకాల గ్యారంటీ కార్డు గురించి వివరిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి
- పరిగి వార్డుల్లో పర్యటన
- ఇంటింటా గ్యారంటీ కార్డుపై ప్రచారం

పరిగి: మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 9, 11వ వార్డుల్లో ఆయన పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాల గ్యారంటీ కార్డు గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 6 పథకాల గ్యారంటీ కార్డును అమలు చేస్తామని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే కాంగ్రెస్ ఆరు గ్యారంటీ కార్డును రూపొందించినట్లు తెలిపారు. తాము ఏ గ్రామానికి వెళ్లినా కాంగ్రెస్ హయాంలో చేసిన అభి వృద్ధే కనిపిస్తోందన్నారు. సీఎం కేసీఆర్ హామీలు ఇచ్చి నెరవేర్చడం లేదన్నారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలు విసిగిపోయారని అన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే చేతగాని తనం వల్లే పరిగి అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పరిగిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, సీనియర్ నాయకులు నర్సింహులు, శ్రీనివాస్, మాధవరెడ్డి, సర్వర్, ఖదీర్, నసీం, జగన్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి ఇంట్లో చోరీ

- ఆరు తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షలు అపహరణ

పరిగి: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి ఆరు తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన పరిగి టీచర్స్ కాలనీలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పూడూరు మండలం కంకల్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ దోమ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. పరిగి టీచర్స్ కాలనీలో సొంత ఇల్లు నిర్మించుకుని అక్కడే ఉంటున్నాడు. గత నెల 30న భార్య తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో ఆదివారం రాత్రి చంద్రశేఖర్ కంకల్ వెళ్లాడు. సోమవారం ఉదయం తిరిగి వచ్చాడు. ఇంటి తాళం పగలగొట్టి ఉండడం, లోపల లైట్లు వెలుగుతుండడంతో దొంగలు పడ్డారని భావించాడు. భయాందోళన చెందిన చంద్రశేఖర్ ఇంట్లో అద్దెకు ఉంటున్న వారి సాయంతో తలుపు సీక్రెట్ లాక్ తీసి లోనికి వెళ్లాడు. రెండు అల్మారాలు తెరిచి ఉండడం, దుస్తులు చిందర వందరగా పడి ఉండడంతో దొంగతనం జరిగిందని గుర్తించాడు. ఇంట్లో భద్రపరిచిన 6.3 తులాల బంగారు ఆభరణాలు, 3 లక్షల 7వేల రూపాయల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు.



చిందర వందరగా పడిఉన్న దుస్తులు

కిచెన్ వెంటిలేటర్ అద్దాలు పగులగొట్టి..

చంద్రశేఖర్ ఇంటి తలుపులకు తాళం తోపాటు సీక్రెట్ లాక్ ఉంది. దొంగలు తాళం పగులగొట్టినా తలుపులు తెరుచుకోలేదు. దీంతో పక్కనే నిర్మాణంలో ఉన్న భవనం పైకి ఎక్కి కిచెన్ వెంటిలేటర్ అద్దాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి నగలు, నగదు ఎత్తుకెళ్లారు. చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

జర్నలిస్టులపై ప్రభుత్వం చిన్నచూపు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

- అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి
- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి
- గాంధీ చౌక్ వద్ద నిరసన



గాంధీ చౌక్ వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

తాండూరు టౌన్: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి ఆరోపించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద నిరశన తెలిపారు. అనంతరం గాంధీ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచారి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. ఏళ్ల తరబడి జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పేర్కొన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. అర్హులైన, ఆర్థికంగా వెనుకబడిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. హెల్త్ కార్డులు పంపిణీ చేయాలన్నారు. మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటే మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. మూడేళ్లుగా నిలిచిన రైల్వే పాసులను పునరుద్ధరించాలని కోరారు. తాండూరులో ప్రెస్ క్లబ్ తోపాటు కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. మంత్రులు మహేందర్‌రెడ్డి, సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి జర్నలిస్టుల సమస్య పరిష్కారానికి ముందడుగు వేయాలని కోరారు. అనంతరం తాండూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, సాక్షి రామకృష్ణ మాట్లాడారు. పేద జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు చేయాలని, దళిత, బీసీ, మైనార్టీ బంధు పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమ నిధిని రూ. 1000 కోట్లకు పెంచాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిరంజన్, సీనియర్ జర్నలిస్టులు వెంకటేశం, భీమ్‌సేన్ రావు పాల్గొన్నారు.

కేఎల్ఆర్‌కే ప్రజల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న థారాసింగ్‌జాదవ్

- ఆయన అభ్యర్థిత్వాన్ని కోరుకుంటున్నారు
- కష్టకాలంలో కాంగ్రెస్‌ను నడిపించిన రమేష్ మహరాజ్
- పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్ జాదవ్

తాండూరు: కేఎల్ఆర్‌కే తాండూరు ప్రజల మద్దతు ఉందని, కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయన అభ్యర్థిత్వాన్ని కోరుకుంటున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్ జాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రమేష్ మహరాజ్ మద్దతు ప్రకటించిన రోహిత్‌రెడ్డి విజయం సాధించారన్నారు. గెలిచిన కొన్నాళ్లకే రోహిత్‌రెడ్డి పార్టీ వీడి బీఆర్‌ఎస్‌లో చేరారన్నారు. అప్పట్లో కాంగ్రెస్ నాయకులంతా ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్‌లో చేరారన్నారు. అలాంటి కష్ట సమయంలో కాంగ్రెస్ పార్టీని నడిపించేందుకు రమేష్ మహరాజ్ ముందుకు వచ్చారని పేర్కొన్నారు. ఆయన చొరవతో గ్రామ గ్రామాన పార్టీ పటిష్టంగా మారిందన్నారు. రమేష్ మహరాజ్ తోపాటు మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ కాంగ్రెస్ తాండూరు టికెట్ ఆశించారన్నారు. పార్టీ శ్రేణుల్లో గందరగోళం లేకుండా ఉండేందుకు కేఎల్ఆర్‌కు రమేష్ మహరాజ్ మద్దతు పలికారన్నారు. రమేష్ మహరాజ్ సూచించిన కేఎల్ఆర్ గెలుపు ఖాయమన్నారు. అయితే ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి ఇద్దరు నాయకులు కాంగ్రెస్‌లో చేరారని, వారు తమకే టికెట్ వస్తుందని చెప్పుకోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించిన వారికే టికెట్ వస్తుందని, అప్పటి వరకు ఎవరూ దీనిపై మాట్లాడరాదని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వస్తున్నారంటూ కొందరు జోరుగా ప్రచారం చేస్తున్నారని, మనోహర్‌రెడ్డి మంత్రి కేటీఆర్ అనుచరుడని అన్నారు. అలాంటి వారికి టికెట్ ఇస్తే గెలిచిన తర్వాత పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరతారని అన్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన రోహిత్‌రెడ్డి పార్టీ మారడం వల్ల నాయకులు అన్ని విధాలా నష్టపోయారన్నారు. సమావేశంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కే శోభారాణి, పెద్దేముల్ మండల వైస్ ఎంపీపీ మధులత, పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్, పట్టణ యూత్ అధ్యక్షుడు బీ వేణుగోపాల్, పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, నాయకులు నర్సింహులు, జనార్దన్‌రెడ్డి, బీ వెంకటయ్య, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా హెల్త్ మేళా

షాద్‌నగర్: వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మంగళవారం మెగా హెల్త్ మేళా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆవరణలో నిర్వహించనున్న ఈ వైద్య శిబిరానికి నగరంలోని ఉస్మానియా ఆస్పత్రి నుంచి ప్రత్యేక బృందం రానున్నట్లు తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కార్డియాలజీ, డెర్మటాలజీ, మెడికల్ గ్యాస్ట్రో, న్యూరో, గైనిక్, పీడియాట్రిక్ వైద్య నిపుణులు, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ వైద్యులు విచ్చేస్తున్నట్లు తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు ఉదయం 8గంటల నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

వ్యక్తి బలవన్మరణం

చేవెళ్ల: కడుపు నొప్పి భరించలేక ఓ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలోని కమ్మెటలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కాశ సురేశ్(28), భార్య కవిత నార్సింగి మున్సిపాలిటీలో చెత్త సేకరణ కూలీలుగా పనిచేస్తున్నారు. కాగా అతడు కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం భార్యాపిల్లతో కలిసి భోజనం చేసి పడుకున్నారు. తెల్లవారుజామున భార్య లేచి చూసే వరకు భర్త కనిపించలేదు. బయటకు వెళ్లి చూడగా పక్కనే ఉన్న గుడిసె పైకప్పుకు తాడుతో ఉరేసుకుని కనిపించాడు. ఆందోళన చెందిన ఆమె సురేశ్ తండ్రి పెంటయ్యకు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. సురేశ్ తండ్రి వచ్చే వరకే సురేశ్ మృతి చెందాడు. చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపులపై దాడులు

అక్రమ మద్యం స్వాధీనం

ఇబ్రహీంపట్నం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై పోలీసులు దాడులు చేశారు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ మైబెల్లి కథనం ప్రకారం.. పోచారం గ్రామంలో లింగమయ్య (52) కిరాణాషాపులో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అనుమతి లేకుండా నిల్వ చేసుకున్న 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా పొల్కంపల్లిలో నిర్మల(45) కిరాణషాపుపై దాడి చేసి 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నాగన్‌పల్లిలో సత్యనారాయణ(42) బెల్ట్ షాపుపై దాడిచేసి తొమ్మిది బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గాంధీ జయంతి రోజున గ్రామాల్లో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఈ దాడులు జరిపినట్లు పేర్కొన్నారు.

పేదల పాలిట వరం సీఎంఆర్‌ఎఫ్

- ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: సీఎం సహాయ నిధి పథకం పేదల పాలిట వరమని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో తాండూరు, పెద్దేముల్ మండలాలకు చెందిన 45 మంది లబ్ధిదారులకు రూ. 29.14 లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని అన్నారు. సీఎం కేసీఆర్ పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, బీఆర్‌ఎస్ నాయకులు పట్లోళ్ల నర్సింహులు, కోహీర్ శ్రీనివాస్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

- స్వచ్ఛంద సంస్థల సేవలు హర్షణీయం
- ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

తాండూరు టౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అన్నారు. సోమవారం మహాత్మాగాంధీ, మాజీ రాష్ట్రపతి లాల్ బహదూర్ శాస్త్రిల జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని బాలాజీ మందిర్‌లో లయన్స్‌క్లబ్, ఆర్యవైశ్య యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. 75 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సేవే లక్ష్యంగా పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల సేవలు హర్షణీయమన్నారు. రక్తదానం, నేత్రదానం, కృత్రిమ అవయాల అమరిక, చలివేంద్రాల ఏర్పాటు వంటి అనేక సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఎంతో సేవ చేస్తున్న సంస్థల సభ్యులను ఆయన అభినందించారు.

‘లక్నాపూర్’ అభివృద్ధిలో అవినీతి

- రూ. 7.5 కోట్ల నిధుల దుర్వినియోగం
- బీజేపీ నాయకుడు పరమేశ్వర్‌రెడ్డి



లక్నాపూర్ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

పరిగి: లక్నాపూర్ ప్రాజెక్టు అభివృద్ధి కోసం ప్రభుత్వ విడుదల చేసిన నిధుల వినియోగంలో అవినీతి జరిగిందని బీజేపీ నియోజకవర్గ నాయకుడు పరమేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం లక్నాపూర్ ప్రాజెక్టును బీజేపీ నాయకులు సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్నాపూర్ ప్రాజెక్టు అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.7.5 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు నిర్వహిస్తే.. పనులు ఎక్కడా కనిపించడం లేదన్నారు. కమీషన్లకు అలవాటు పడి అభివృద్ధిని బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అభివృద్ధి నిరోధకుడిగా మారారన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే లక్నాపూర్ ప్రాజెక్టును పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘కేవీపీఎస్’తో సామాజిక మార్పులు



ఆవిర్భావ వేడుకల్లో కేవీపీఎస్ నాయకులు

యాలాల: దళిత, గిరిజన, బలహీన వర్గాల సమస్యలపై కేవీపీఎస్ అలుపెరగని పోరాటం చేసిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్కయ్య అన్నారు. సోమవారం కేవీపీఎస్ 25 సిల్వర్‌జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలు, దళితులు సామాజికంగా, ఆర్థికంగా, న్యాయ పరంగా హక్కుల సాధనకు కేవీపీఎస్ అండగా ఉందన్నారు. గత 25 ఏళ్లుగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక మార్పులను తీసుకురావడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే అక్టోబర్ 2 నుంచి 9 వరకు జిల్లా వ్యాప్తంగా కేవీపీఎస్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, కేవీపీఎస్ నాయకులు మలిగేరి నర్సింహులు, శ్రీనివాస్, రాజు, రమేశ్, రాంబాబు, సాయిరాం, జీవప్ప, లాలప్ప తదితరులు ఉన్నారు.